క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



రంగాపురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ సచివాలయంలో నంద్యాల శాంతిరామ్ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ప్రద్యుమ్న, నమ్రత, శిరీష గ్రామంలోని రోగులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్లు అవసరం అయిన వారికి నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని మెట్టుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చిన్నపరెడ్డి తాను పని చేస్తున్న పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రతి రోజూ మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయుడు శివ మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుతున్న 115 మంది విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేసేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. పాఠశాలలకు సెలవులు ఇచ్చే వరకు ఈ కార్యక్రమాన్ని ప్రతి రోజూ చేపడతానని చిన్నపరెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న చిన్నపరెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

ఎర్ర బ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

డోన్ టౌన్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తెల్లవారుజామున ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్‌కార్మికులు ఎర్ర బ్యాడ్జీలతో డిపో గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ రీజనల్ ప్రచార కార్యదర్శి డీవీఆర్ రెడ్డి, డిపో చైర్మన్ బీవీ రమణయ్య, అధ్యక్షుడు కేవీ రామయ్య, కార్యదర్శి బాల మద్దయ్య, యాక్సిడెంటల్ కమిటీ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ.. మార్చి 25వ తేదీ 38 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్టీసీ ఎండీకి అందజేశామని అయితే నేటి వరకు సమస్యలు పరిష్కారం కానందున ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైనట్లు తెలిపారు.

సురక్షితంగా గమ్యం చేరాలి



టెస్ట్ డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు

డోన్ టౌన్: ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ కార్మికులు కృషి చేయాలని ఉమ్మడి కర్నూలు జిల్లా డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ హరినాథ్ సూచించారు. ఆయన బుధవారం డోన్ డిపో గ్యారేజ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్సుల కండీషన్, గ్యారేజ్‌లోని వివిధ విభాగాల్లో పనితీరును పరిశీలించారు. రిపేరు చేసిన బస్సును ఎక్కి రోడ్డు ట్రయల్ రన్ చేపట్టి సంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్సులు మార్గం మధ్యలో నిలిచిపోకుండా, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాలని డిపో మెకానిక్‌లను ఆదేశించారు. డిపో మేనేజర్ శశిభూషణ్, గ్యారేజ్ సూపర్‌వైజర్ గోపాల్ తదితరులు ఉన్నారు.

స్త్రీ నిధి రుణ బకాయిలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా స్త్రీ నిధి ఏజీఎం నాగప్రసాద్

బనగానపల్లె రూరల్: డ్వాక్రా సంఘాలు స్త్రీనిధి పథకం కింద తీసుకున్న రుణాల చెల్లింపు బకాయిలపై డీఆర్‌డీఏ సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నాగప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం అడ్డాకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్త్రీ నిధి రుణాల వసూళ్లపై సమీక్ష జరిగింది. ఏజీఎం మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాలు చెల్లించని సంఘాల మహిళలకు అవగాహన కల్పించి, త్వరగా బకాయిలు కట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వెలుగు సిబ్బంది సహాయ సహకారాలను అందించాలని సీసీలకు సూచించారు.

పేదలపై పీ-4 సర్వే పిడుగు

- 27రకాల ప్రశ్నలతో సచివాలయ ఉద్యోగుల సర్వే
- ఇంట్లోని వస్తువుల వివరాలు సైతం నమోదు
- చడీచప్పుడు లేకుండా సాగుతున్న సర్వే
- సంక్షేమ పథకాల కోత విధించడం కోసమేనా?



సర్వే నిర్వహిస్తున్న ఉద్యోగులు (ఫైల్)

డోన్ రూరల్: గత ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ ఉదరగొట్టారు. ఇంటింటికీ కరపత్రాలు పంచి మీ ఇంటికి ఈ పథకాలన్నీ వస్తాయి.. ఇంత మేలు జరుగుతుందంటూ నమ్మించారు. కూటమి అధికారంలోకి వస్తే మీ జీవితాలు మెరుగుపడతాయన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక తొమ్మిది నెలలు దాటినా పథకాల అమలుకు నోచుకోలేదు. చెప్పిన వాగ్దానాలు అమలు చేయకుండా సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.

తాజాగా పీ-4 సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తేసేందుకు పాలకులు శ్రీకారం చుట్టారు. సర్వేలో భాగంగా సచివాలయ ఉద్యోగులు ప్రజలకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. టీవీ, ఏసీ, ఫోర్ వీలర్, టూవీలర్, ఇతర గృహోపకరణాలు, ఇళ్ల స్వరూపం, రేకులా, స్లాబా, బ్యాంక్ ఖాతా ఇలా 27 రకాల ప్రశ్నలు అడిగి సమాధానాలను సిబ్బంది నమోదు చేయాల్సిన పరిస్థితి. ఆపై ప్రజల ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చేసి ఈ తతంగాన్ని ముగిస్తున్నారు. జిల్లాలో 1486 రేషన్ దుకాణాల పరిధిలో 8.26 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వేల కుటుంబాలు కొత్త కార్డు కోసం ఎదురు చూస్తున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల వారు సైతం అప్పో, సప్పో చేసి నెలవారి వాయిదాల్లో ఎయిర్ కూలర్లను ఏర్పాటు చేసుకొని ఉంటారు. అయితే ఆ వస్తువు ఇంట్లో ఉందని తెలిస్తే చాలు వెంటనే సదరు వివరాలను ప్రభుత్వ రికార్డుల్లో సచివాలయ సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే ఆందోళన పేదల్లో నెలకొంది.

నిరాకరించినా నమోదు

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవన శైలిలో భాగమైనవే. స్మార్ట్‌ఫోన్, బైక్ ఉన్నాయా లాంటి ప్రశ్నలు ఉండటంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తోంది.

బాబూ నమ్మండయ్యా

పీ-4 సర్వేను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్‌తో నిర్వహిస్తున్నారు. దీన్ని నమ్మాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. ఇంటి వద్దకు సిబ్బంది వెళ్లి వివిధ రకాల సమాచారాన్ని సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఈ సర్వే దోహదపడతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని, ఇందులో ఎలాంటి అపోహలొద్దని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అయోమయం నెలకొంది.

పథకాలు ఇవ్వకలేకనే..



ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయలేకనే కూటమి ప్రభుత్వం పీ-4 సర్వే అంటూ ప్రజలను మోసం చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇటువంటి సర్వేలు చేయలేదు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలి.

– రాంకుమార్‌యాదవ్, వెంకటనాయునిపల్లి గ్రామం.

లబ్ధిదారుల సంఖ్య తగ్గించే కుట్ర



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య తగ్గించేందుకు అనేక ప్రయత్నాలు, సర్వేలు చేస్తుండటం దారుణం.

– బంగారు జయచంద్ర, ఎద్దుపెంట గ్రామ, సర్పంచ్

నేటి నుంచి విద్యుత్ కోతలు

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం నుంచి శనివారం వరకు వరుసగా మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ నిర్మాణం చేపడుతున్న దృష్ట్యా రామకృష్ణాపురం ఫీడర్ పరిధిలోని గార్లదిన్నె, మాధవరం, రామకృష్ణాపురం గ్రామాల్లో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు అందిస్తామని వెల్లడించారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

బేతంచెర్ల: పదో తరగతి పరీక్షలు రాసి పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులకు స్థానిక గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు శేషారెడ్డి హైస్కూలులో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలీసెట్ -2025 దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. శిక్షణకు హాజరైన విద్యార్థులకు మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 99896 43171,98852 55726 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి 16 రోజుల పండుగ



టంగుటూరు పెద్దమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామంలో పెద్దమ్మతల్లి జాతర ముగిసి 16 రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం 16 రోజుల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలో ఉన్న పెద్దమ్మ తల్లికి భక్తులు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెద్దమ్మ ఆలయ కమిటీ సభ్యులు అన్నదానంతో పాటు అన్నివసతులు కల్పించారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు

పెద్దమ్మ తల్లి 16 రోజుల పండుగా సందర్భంగా గ్రామ పెద్దమ్మ కమిటీ, గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రాతిదూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను పారిశ్రామికవేత్త బీసీ రామ్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో ఏపీ తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 14 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా, లింగాల మండలం రామవరం గ్రామానికి చెందిన ఎం.అక్షరరెడ్డి వృషభాలు మొదటి బహుమతి దక్కించుకున్నాయి. రెండవ బహుమతిగా నంద్యాల జిల్లా కానాల గ్రామానికి చెందిన గుత్తి ఉదయ్‌కిరణ్, హుస్సేని వృషభాలు, మూడవ బహుమతి సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దుల్లు, నాల్గొవ బహుమతిగా ప్రకాశం జిల్లా అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దక్షిత్‌నిషాంత్ రెడ్డి, రామవరం గ్రామానికి చెందిన ఎం ధనుష్‌రెడ్డి ఎద్దు గెలుచుకున్నాయి. ఐదవ బహుమతి వైఎస్సార్‌కడప జిల్లా కలసపాడు గ్రామానికి చెందిన బి వెంకటరెడ్డి వృషభాలు, ఆరవ బహుమతిగా మిడుతూరు గ్రామానికి చెందిన సాయివర్ధన్, ఈడిగోని పల్లికి చెందిన వంశీకృష్ణ వృషభాలు, ఏడవ బహుమతిగా కోవెలకుంట్ల మండలం లింగాల గ్రామానికి చెందిన పవన్ కుమార్‌రెడ్డి ఎద్దులు దక్కించుకున్నాయి. విజేతలైన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.60 వేలు, రూ.40, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు బహుమతులు అందించి సన్మానించారు.

ఉమామహేశ్వరులను దర్శించుకున్న మంత్రి బీసీ

బనగానపల్లె: ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటిలో ఉమామహేశ్వరులను రాష్ట్ర రోడ్డు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం మంత్రి బీసీకి ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకులు స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ.. గర్భాలయంలో రూ.4లక్షల సొంత నిధులతో రెండు ఏసీల ఏర్పాటుతో పాటు మరో రూ.11లక్షలతో ఆలయంలో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే భక్తుల సౌకర్యార్థం స్థలాన్ని పరిశీలించి వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌలిశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జ్యోతి మహోత్సవాలు



మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో నిర్వహిస్తున్న రాయబారాది జ్యోతి రథ వసంతోత్సవం బుధవారం కూడా కొనసాగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి సహస్త్ర నామ కుంకుమార్చన, పసుపు, కుంకుమ, పట్టు వస్త్రముల అలంకరణ తదితర పూజలు జరిగాయి. సాయంత్రం ధర్మవరానికి చెందిన అభయహస్త సేవా సమితిచే అన్నమయ్య సంకీర్తన నిర్వహించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు అమ్మవారినికి దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ముస్లింల మనోభావాలు దెబ్బతీయడమే మోదీ అజెండా

డోన్ టౌన్: ముస్లింల మనోభావాలను దెబ్బతీయడమే మోదీ అజెండా అని, ఇందుకు నిదర్శనం వక్ఫ బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టడమేనని కాంగ్రెస్ పార్టీ డోన్ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటి స్వామి విమర్శించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమా వేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా కమిటీలో డోన్ వారికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీకి ఎన్నికైన వారిని మద్దిలేటితో పాటు మండల అధ్యక్షుడు హుస్సేన్‌బాషా, పట్టణ అధ్యక్షుడు శేఖర్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల అధ్యక్షులు రామాంజనేయు లు, మహేంద్రనాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

బనగానపల్లె: మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ వల్ల ప్రాణాలు పోతున్నాయని, వీటి నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి కోరారు. బుధవారం మండలంలోని పలుకూరు గ్రామంలో వాకింగ్ మిత్ర బృందంతో కలిసి మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డబ్బు వెచ్చించి వ్యాధులు కొని తెచ్చుకునేవి మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ అన్నారు. కార్యక్రమంలో వాకింగ్ మిత్ర బృందం సభ్యులు షరాబు చంద్రశేఖర్, ఆచారి రామసుబ్బయ్య, దాసు భాస్కర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనం గుండెల్లో శేషారెడ్డి స్థానాన్ని చెరపలేరు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: బోర్డులపై ఉన్న పేర్లను తొలగించవచ్చు కానీ డోన్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బీవీ శేషారెడ్డి చేసిన సేవలను, ప్రజల గుండెల్లో ఆయనకు ఉన్న స్థానాన్ని చెరిపేయలేరని స్టేట్ మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కృష్ణమూర్తి, నాయకులు మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, బొర్రా మల్లికార్జునరెడ్డి స్పష్టం చేశారు. ప్యాపిలిలో వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి ఏర్పాటు చేసిన బుగ్గన శేషారెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ బోర్డుపై ఉన్న బుగ్గన శేషారెడ్డి పేరును చెరిపివేయడం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ బోర్డును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ బీవీ శేషారెడ్డి డోన్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన ఆయన పేరును ప్రజల కోరిక మేరకే అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు పెట్టారని వివరించారు. ఆ మహనీయుడి పేరు బోర్డుపై తొలగించినంత మాత్రాన ప్రజల గుండెల్లో ఆయన స్థానాన్ని తొలగించలగరా? అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే పేరును తొలగించడంలో పెట్టిన శ్రద్ధ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పునః ప్రారంభిచడంలో పెడితే మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

'కోట్ల' విగ్రహాన్ని ఆవిష్కరించిన ఘనత బుగ్గనది

ప్యాపిలిలో దశాబ్ద కాలంగా ఆవిష్కరణకు నోచుకోకుండా పడి ఉన్న మాజీ ముఖ్యమంత్రి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసి ఆవిష్కరించిన ఘనత మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డిని తామెంతో గౌరవిస్తామన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. డోన్ నియోజకవర్గంలో పేర్లను చెరిపివేసే సంస్కృతికి ముగింపు పలకాలన్నారు. బోర్డుపై శేషారెడ్డి పేరును తొలగించిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సోమేశ్ యాదవ్, వెంగలాం రామచంద్రారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, బోరెడ్డి రాము, శ్రీనివాసరెడ్డి, బషీర్, కొండయ్య, మస్తాన్‌ఖాన్, సోమశేఖర్, రంగస్వామి, మదన్ మోహన్, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జయరామయ్య, నిజాం, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సంజామల: మండలంలోని ఎన్ఆర్‌జీసీ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. వారి స్థానంలో పలువురు ఉద్యోగులు బాధ్యతలు స్వీకరించారు. బనగానపల్లెలో ఇంజినీర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న హరికిశోర్, కొలిమిగుండ్లలో టీఏలుగా పనిచేస్తున్న బాలరాజు, బాషా నాయక్, కోవెలకుంట్ల, బనగానపల్లెలో కంప్యూటర్ ఆపరేటర్స్ పనిచేస్తున్న కిరణ్, పెద్ద ఓబులం సంజామలకు బదిలీ కాగా.. బుధవారం విధుల్లోచేరి బాధ్యతుల స్వీకరించారు.

హిందూ ధర్మ రక్షణకు సహకరించాలి

బేతంచెర్ల: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ధర్మ రక్షా నిధికి ప్రతి ఒక్క హిందువు తమ బాధ్యతగా సహకారం అందించాలని జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బేతంచెర్ల పట్టణంలో ప్రముఖులను కలిసి ధర్మ రక్ష నిధి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు పక్కిరయ్య, సభ్యులు బుగ్గన రమణారెడ్డి, ఆవతి మద్దయ్య పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

కోవెలకుంట్ల: పట్టణంలోని రెండు పేకాట స్థావరాలపై బుధవారం పోలీసులు దాడి చేశారు. రెండు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఏక కాలంలో దాడి చేసి 19 మందిని అదుపులోకి తీసుకొని రూ.48 వేలు స్వాధీనం చేసుకున్నట్లు కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ తెలిపారు. ఒక చోట దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని రూ.36వేలు, మరో చోట ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.12వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

దాడి ఘటనలో ఏడుగురిపై కేసు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన వ్యక్తిపై అదే కాలనీకి చెందిన ఏడుగురు పాత కక్షలను మనసులో పెట్టుకొని దాడి చేసి గాయపరిచారని బాధితుడు పోలీస్ స్టేషన్‌ల్ ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు.. దుర్గాపేట కాలనీకి చెందిన గూటం మద్దిలేటిపై అదే కాలనీకి చెందిన గజ్జి శ్రీనివాసులుతో పాటు మరో ఆరుగురు వ్యక్తిగత కక్షలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడు గూటం మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య బుధవారం తెలిపారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లె సమీపంలోని ఎగువ ప్రాంతంలో బుధవారం ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. బనగానపల్లె వైపు నుంచి వడ్ల బస్తాలతో తాడిపత్రి వైపు వెళ్తున్న లారీ కనకాద్రిపల్లె వద్ద ఎగువ ప్రాంతానికి వచ్చే సరికి ఆగిపోయింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, హోంగార్డు రామ్మోహన్ స్పందించి మధ్యలో నిలిచిపోయిన లారీని దిగువ ప్రాంతానికి పంపించి నెమ్మదిగా పైకి వచ్చేలా డ్రైవర్‌కు సూచనలిచ్చారు. లారీ ప్రయాణించే సమయంలో రెండు వైపుల నుంచి వాహనాలు రాకుండా కట్టడి చేయడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

దశాబ్దాల అనుబంధం

కొలిమిగుండ్ల: ఆ ఊరితో గబ్బిలాలకు దశాబ్దాలుగా అనుబంధం ముడివేసుకుంది. అన్ని ఊర్లలో కోడికూతతో ప్రజలు నిద్ర మేల్కొంటే ఈ గ్రామస్తులు మాత్రం గబ్బిలాల కిచకిచలతో నిద్ర లేస్తుంటారు. తుమ్మలపెంటలోని శివాలయం ఆవరణలో ఉన్న చింతచెట్లకు రెండువేలకు పైగానే గబ్బిలాలు స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాయి. అవి చాలా ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఎవరికి ఎలాంటి హాని కలిగించలేదన్నారు. చెట్లపై తలకిందలుగా వందల సంఖ్యలో వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. రాత్రిళ్లు ఆహారం కోసం బయటకు వెళ్లి తెల్లవారే సరికి చెట్లపైకి చేరుతుంటాయి.



చింత చెట్లపై వేలాడుతున్న గబ్బిలాలు

శ్రీరామనవమికి ఏర్పాట్లు



ఆలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దిన దృశ్యం

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలోని రామాలయంలో ఈనెల 6వ తేదీన శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కేపీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. కల్యాణం నిర్వహించే వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ప్రత్యేక పూజలు, కల్యాణం అనంతరం భక్తులకు కేపీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేయనున్నారు. సాయంత్రం మేళతాళాలతో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామ సమీపాన నంద్యాల రహదారిలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయలయ్యాయి. వివరాల మేరకు.. పాణ్యం మండలం కందికాయపల్లె గ్రామం వద్ద గ్రీన్‌కో సోలార్ పరిశ్రమ వద్ద జాఫర్, జానేద్, సోహిల్ పనులు ముగించుకొని కారులో బేతంచెర్లకు వస్తున్నారు. అలాగే జమ్మలమడుగు నుంచి మోహన్, మధు కారులో సిమెంట్ నగర్ వైపు వెళ్తుండగా బుగ్గానిపల్లె గ్రామ సమీపాన ప్రమాదవశాత్తు రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జాఫర్, జానేద్ తలకు తీవ్రగాయాలు కాగా, మోహన్‌కు చెయ్యి విరిగింది. సోహిల్, మధు గాయాలపాలయ్యారు. వారిని 108 వాహనంలో బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు.

అక్రమ మద్యం విక్రేతల అరెస్ట్



పట్టుబడిన మద్యం చూపుతున్న సీఐ వరలక్ష్మి

డోన్ రూరల్: అక్రమంగా మద్యం అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం సీఐ వరలక్ష్మి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బేతంచెర్ల మండలంలోని ఆర్‌ఎస్.రంగాపురంలో దాడులు నిర్వహించగా యు.సాగర్ అనే వ్యక్తి అక్రమంగా నాటు సారా విక్రయిస్తుండటంతో అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే డోన్ మండలంలోని దేవరబండ గ్రామానికి చెందిన ఎర్రబోయిని మద్దయ్య, ఈడిగ రవి అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 15 లీటర్ల నాటు సారా, 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. సీఐ లక్ష్మణదాస్, ఎక్సైజ్ ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.